క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి శస్త్ర చికిత్సలకు పంపుతున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఉరవకొండ: స్థానిక ఉరవకొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం మంగళవారం ఏర్పాటు చేశారు. ఇందులో 15 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎంసీ జయకృష్ణ, లయన్స్ సభ్యులు గణేష్‌బాబు, జీకే శ్రీధర్, నగేష్ పాల్గొన్నారు.

గౌని అనంతమ్మకు ఘన నివాళి



సర్పంచ్ గౌని అనంతమ్మకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుమ్మఘట్ట: మండలంలోని గొల్లపల్లి గ్రామ సర్పంచ్ గౌని అనంతమ్మ మృతదేహానికి నాయకులు నివాళులర్పించారు. సర్పంచు గౌని అనంతమ్మ అనారోగ్యంతో సోమవారం మృతిచెందిన విషయం విదితమే. అనంతమ్మ మృతి పార్టీకి తీరనిలోటు అని పలువురు నాయకులు అన్నారు. వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మెట్టు విశ్వనాథరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, ఎంపీపీ భవాని, సర్పంచులు, ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.

సమష్టిగా ప్రజల పక్షాన పోరాటం చేద్దాం

విడపనకల్లు: భవిష్యత్‌లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టబోవు కార్యక్రమాల్లో ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు చురుగ్గా పాల్గొని, ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉందామని పార్టీ మండల కన్వీనర్ బసన్న పిలుపునిచ్చారు. మండలంలోని సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెద్దామన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండల కన్వీనర్ బసన్న స్థానిక నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి వేడుకలకు పెద్ద ఎత్తున తరలివచ్చి, విజయవంతం చేశారని, వైఎస్సార్‌సీపీ ప్రతి కుటుంబ సభ్యుడికి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళా కార్యకర్తలు, యువతకు బసన్న ధన్య వాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భీంరెడ్డి, భరత్‌రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు సుంకన్న, దేశాయ్ సిద్దార్థ, బోయ నాగేంద్ర పాల్గొన్నారు.

డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ



ఉరవకొండలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లోజీరావు, వైద్యాధికారులు డాక్టర్ భరత్, డాక్టర్ ఇస్మాయిల్, మలేరియా డివిజన్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం శివరామిరెడ్డి కాలనీలోని అంబేడ్కర్ బాలయోగి ఎస్సీ గురుకుల పాఠశాలలో సీజనల్ వ్యాధులపై విద్యార్థినులకు అవగాహన సమావేశం నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



ఉద్దేహాళ్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్: గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మీ, మల్లీశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో మలేరియా, డెంగీ, చికున్‌గన్యా వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన ర్యాలీ చేశారు. అనంతరం స్టాఫ్ డయేరియాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు గోవర్దన, జైనాబీ, అంగన్వాడీ కార్యకర్త కృష్ణవేణి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అదిగో చిరుత.. ఇదిగో ఎలుగుబంటి

- వన్యప్రాణులను చూసి జనం బెంబేలు
- పెరుగుతున్న చిరుతలు, ఎలుగుబంటి దాడులు
- పశువులు, జీవాలకు పొంచి ఉన్న ముప్పు
- భయాందోళనలో పశువులు, గొర్రెల కాపర్లు
- క్లెయిమ్ చేస్తే పరిహారం చెల్లింపు



మల్లాపురం వద్ద మేకలపై దాడిచేసి చంపేసిన చిరుత (ఫైల్)



చెరువుదొడ్డి వద్ద చిరుత దాడిలో మృతి చెందిన మేకలను పాతిపెడుతున్న అటవీశాఖ అధికారులు (ఫైల్)

రాయదుర్గం: చిన్నపిల్లలను బుజ్జగించేందుకో.. గోరుముద్దలు తినిపించేందుకో..మారాం చేస్తుంటేనో..నిద్ర పోకుంటేనో అమ్మలు, నానమ్మలు అదిగో చిరుత.. ఇదిగో ఎలుగుబంటి వచ్చె..అని వన్యప్రాణులను గుర్తు చేస్తుంటారు. కానీ నిజంగానే అడవుల సమీపంలో ఉండే గ్రామాలు, పట్టణాల్లోకి చిరుతలు, ఎలుగుబంటి, అడవిపందులు, కోతులు చొరబడి అలజడి సృష్టిస్తున్నాయి. ఎప్పుడు ఎటువైపు వన్యప్రాణులు వచ్చి దాడి చేస్తాయోనని అడవులు, కొండ ప్రాంతాల చుట్టుపక్కల నివసించే రైతులు, గ్రామీణ ప్రజలు, పశువుల కాపర్లు భయాందోళన చెందుతున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో సుమారు పదుల సంఖ్యలోనే పశువులు, గొర్రెలు, మేకలు, మనుషులపై చిరుతలు, ఎలుగుబంటి దాడి చేశాయి. కానీ కొందరు అనవసరంగా గందరగోళానికి గురై చిరుతను చూసినట్టు ఇతరులను భయపెట్టరాదు.. వన్యప్రాణులపై దాడి చేస్తే అటవీ చట్టాలు కఠినంగా ఉంటాయి. ఎక్కడైనా వన్యప్రాణులు దాడి చేసినట్లయితే సమాచారం ఇవ్వాలని, సత్వరం అక్కడికి చేరుకొని పరిహారం మంజూరుకు కృషి చేస్తామని అటవీఅధికారులు చెప్తున్నారు.

- రాయదుర్గం పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డు చెక్‌పోస్టు సమీపంలో వారం రోజుల క్రితం ఎలుగుబంటి కనిపించింది. దీంతో స్థానికులు భయాందోళన చెందారు. స్థానికులు అరుపులు, కేకలు పెట్టడంతో ఎలుగుబంటి కొండ ప్రాంతంలోకి పరుగులుతీసింది. ఎలుగుబంటిని చూసిన ప్రజలు.. అటువైపు వెళ్లాలంటేనే జంకుతున్నారు.
- గుమ్మఘట్ట మండలం 75 వీరాపురంలో రైతు గోవిందరెడ్డికి చెందిన గేదెపై చిరుత దాడి చేసి చంపేసింది. అదే గ్రామానికి చెందిన లింగప్ప మందలపై చొరబడి రెండు గొర్రెలను చంపింది. పరిహారం కోసం ఈ ఇద్దరు కాపరులు దరఖాస్తు చేసుకున్నారు.
- ఇటీవల కళ్యాణదుర్గం పట్టణ సమీపంలోని ఓ కాలనీకి సమీపంలో చిరుత సంచరించింది. చిరుతను చూసిన స్థానికులు భయంభ్రాంతులకు గురయ్యారు. రాయదుర్గం పట్టణం సమీపాన కూడా చిరుతల సంచారం ఎక్కువైంది.
- బ్రహ్మసముద్రం మండలం బొమ్మగానపల్లిలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద రైతు పూజారి వెంకటేశులు నిద్రిస్తుండగా చిరుత చొరబడింది. అక్కడే కట్టేసిన ఆవుపై దాడి చేసి చంపేసింది. ఆతర్వాత చిరుత అక్కడి నుంచి అడవిలోకి పారిపోయింది.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో అటవీ భూభాగం విస్తరించి ఉంది. అందులో ఆవాసంగా ఉండే పెద్దపులి, ఎలుగుబంటి, అడవి పంది, కోతి, చిరుత తదితర వన్య ప్రాణులవల్ల మనుషులు, పశువులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. అడవుల్లో నీరు, ఆహారం లేకపోవడం, అటవీ ప్రాంతాలను ఆనుకొని కొత్తగా జనావాసాలు ఏర్పాటు చేసుకోవడంతో ఈ సమస్య పెరుగుతోంది. పై మూడు నియోజకవర్గాల్లోనూ సుమారు పదుల సంఖ్యలోనే పశువులు, గొర్రెలు, మేకలు, మనుషులపై చిరుతలు, ఎలుగుబంటి దాడులు చేశాయి. రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో చిరుతల సంచారం అధికంగా కనిపిస్తోంది. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అడవుల సమీప గ్రామాలు, పట్టణాల్లోకి వన్యప్రాణులు చొరబడి అలజడి సృష్టిస్తున్నాయి. ఇలాంటి ఘటనలు ఇటీవల కాలంలో అధికమయ్యాయి. అడవులు, కొండ ప్రాంతాల చుట్టుపక్కల నివసించే రైతులు, గ్రామీణ ప్రజలకు ఇది కొత్త సమస్య కాదు.

అవగాహన కల్పించాలి

వన్యప్రాణులు గాయపరిస్తే వెంటనే చికిత్స తీసుకునే విధానాలను అటవీ శాఖ అధికారులు ప్రజలకు తెలియజేయాలి. ఈ సమాచారాన్ని గ్రామ పంచాయతీల స్థాయిలో చలనచిత్రాల రూపంలో ప్రదర్శించాలి. ఎక్కువగా ఏయే జాతుల వన్యప్రాణులు నివాస ప్రాంతాల్లోకి చొరబడే అవకాశం ఉందో, ఆ సమస్యను ఎలా అధిగమించాలో అటవీశాఖ ప్రత్యేక అధ్యయనం చేయాలి. అడవుల నరికివేతను అరికట్టాలి. వన్యప్రాణుల వేటగాళ్లపై ఉక్కుపాదం మపాలి. పశువులు, మనుషులు గాయపడితే పొందే పరిహారంపై వివరించాలి. పంట నష్ట పరిహారానికి ఎంత చెల్లిస్తారో రైతులకు చెప్పాలి.

పరిహారం ఎలా పొందాలంటే..

- వన్యప్రాణుల దాడుల్లో పశువులు, మేకలు, గొర్రెలు మృతి చెందితే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, పశువైద్యాధికారికి సమాచారం ఇవ్వాలి.వారు పరిశీలించి సర్టిఫికెట్ (పంచనామా) చేశాకే పాతిపెట్టాలి.
- డీఎఫ్ఓ మంజూరు చేసిన చెక్కుల ద్వారా పరిహారం చెల్లిస్తారు.
- వన్యప్రాణుల దాడుల్లో మనుషుల మరణం లేదా గాయపడినప్పుడు (పాములు, కోతులు మినహా) దాడి జరిగిన ప్రాంతాన్ని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లేదా ఎస్ఐ ర్యాంకుకు తక్కువలేని ఉద్యోగి 48 గంటల్లో స్పాట్ ఇన్‌స్పెక్షన్ చేసి, నివేదిక తయారు చేస్తారు.
- మృతికి గల కారణంపై అసిస్టెంట్ సివిల్ సర్జన్‌తో పోస్టుమార్టం నిర్వహించి, సర్టిఫికెట్ తీసుకోవాలి.
- వన్యప్రాణుల దాడులు జరిగినప్పుడు బాధితులు చట్టాలను ఉల్లఘించరాదు. ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిపై తిరిగి దాడి చేస్తే శిక్షార్హులవుతారు.



బ్రహ్మసముద్రం మండలం బొమ్మగానిపల్లి సమీపాన చిరుత దాడిలో మృతి చెందిన ఆవు (ఫైల్)

ఘటనాస్థలిలోనే పోస్టుమార్టం

వన్యప్రాణుల దాడిలో మృతి చెందిన పశువులు, మేకలు, గొర్రెలకు ఘటనాస్థలంలోనే పోస్టుమార్టం చేస్తాం. వాటికి అక్కడే ధర నిర్ణయించి, పరిహారం మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపుతాం. చాలా మందికి బాధితులకు అటవీశాఖ పరిహారం కూడా చెల్లించింది.

– నవీన్‌కుమార్, పశు వైద్యాధికారి, రాయదుర్గం

అటవీ చట్టాలు కఠినతరం

కొందరు హైనా చూసినా గందరగోళానికి గురై చిరుతను చూసినట్టు ఇతరుల్ని భయపెట్టేస్తారు. వన్యప్రాణుల జోలికి వెళితే అటవీ చట్టాలు కఠినంగా ఉంటాయి. వాటిని ప్రయోగిస్తే జైలుకు వెళ్లక తప్పదు. వన్యప్రాణుల దాడుల్లో మూగజీవాలు మృతి చెందినట్టు రైతులకు తెలియగానే వాటిని తొలగించకుండా అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. సత్వరం అక్కడికి చేరుకొని వాటిపై ఏ జంతువు దాడి చేసిందో గుర్తించి.. దాని తీవ్రతను పరిగణనలోకి తీసుకొని రక్షించే చర్యలు చేపడతాం. అంతేకాకుండా పరిహారం మంజూరుకు కృషి చేస్తాం.

– ఆంజనేయులు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, రాయదుర్గం

నేడు కౌలుకు ఆలయ భూముల వేలం

ఉరవకొండ: వజ్రకరూరు మండలం పొట్టిపాడులో వెలసిన శ్రీసుంకలమ్మ, ఈశ్వర, ఆంజనేయస్వామి, కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాల భూములను ఈనెల 10న కౌలు వేలం వేస్తున్నట్లు గ్రూప్ టెంపుల్స్ ఈఓ అంగదాల కృష్ణయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో భూములు దక్కించుకున్న పాటదారుడు 11.07.20024 నుంచి 31.03.2007 వరకు మూడేళ్లపాటు కౌలుకు సాగుచేసుకునే హక్కు ఉంటుందన్నారు. సుంకలమ్మ దేవస్థానానికి సంబంధించి 30.67 ఎకరాలు, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి చెందిన 33.36 ఎకరాలు, ఈశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 11 ఎకరాలు, ఆంజనేస్వామి దేవస్థానానికి సంబంధించి 18.90 ఎకరాల భూములను వేలం వేస్తున్నట్లు తెలిపారు.

రేపు తలనీలాలు, టెంకాయల వేలం

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 11న తలనీలాలు, టెంకాయలు, కొబ్బరి చిప్పలు సేకరణకు వేలం వేస్తున్నట్లు ఈఓ విజయ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 13.08.2004 నుంచి 12.08.2025 వరకు ఏడాది పాటు కాలపరిమితి వరకు ఉంటుందన్నారు. రూ.లక్ష డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

చిరుత సంచారంతో బెంబేలు

రాయదుర్గం రూరల్: మండలంలోని టి.వీరాపురం గ్రామానికి ఆనుకొని ఉన్న కొండ (ఊరుతిప్ప)లో రెండు రోజులుగా చిరుత సంచరిస్తోందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. తాగునీటి పంప్ హౌస్ సమీపంలో ఉన్న గుండుపై చిరుత కనిపించిందని స్థానికులు మంగళవారం సాయంత్రం కేకలు పెట్టారు. దీంతో చిరుత కొండ ప్రాంతంలోకి పరుగు తీసినట్లు గ్రామానికి చెందిన యువకులు తెలిపారు. రాత్రి వేళ అటుగా వెళ్లకూడదని యువత ప్రజలను హెచ్చరించారు. రెండు రోజులుగా ఈ కొండలోనే ఉందని గ్రామస్తులు తెలిపారు.

మొహర్రం వేడుకలకు అనుమతి తప్పనిసరి

కుందుర్పి: గ్రామాల్లో మొహర్రం వేడుకలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ వెంకటస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల అనంతరం పలు గ్రామాల్లో చిన్న గొడవలకు కేసులు నమోదవుతున్నాయని, మొహర్రం నిర్వహించాలంటే గ్రామానికి పది మంది చొప్పున పూచీకత్తుతో పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు.

శేషారెడ్డి సేవలు మరువలేనివి



హెచ్‌ఎం టీ.శేషారెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, పాటిల్ నాగిరెడ్డి

కణేకల్లు: ఉపాధ్యాయులకు ఏ కష్టమొచ్చినా నేనున్నానంటూ భరోసా ఇచ్చే హెచ్‌ఎం టీ.శేషారెడ్డి సేవలు ఎప్పటికీ మరువలేమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం కణేకల్లులోని రామనగర్‌లో హిందూ బాలుర స్కూల్ హెచ్‌ఎం, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టీ.శేషారెడ్డి ఉద్యోగ విరమణ సన్మానసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు నరసింహులు, జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేశులు మాట్లాడారు. శేషారెడ్డి పనిచేసిన పాఠశాలల్లో పక్కా గదులు మంజూరు చేయించారన్నారు. యూనియన్లకతీతంగా అందరినీ కలుపుకుపోయే గొప్ప మనస్సున్న వ్యక్తి అన్నారు. మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి మాట్లాడారు. అనంతరం ఎంపీడీఓ గూడెన్న, ఎంఈఓ లక్ష్మణ్ణ, పీడీ గోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు పైనేటి తిమ్మప్పచౌదరి, కణేకల్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు వై.చంద్రమోహన్‌రెడ్డి, మాజీ వైస్ సర్పంచు యు.ఆనంద్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, కణేకల్లు మండల ఎన్‌జీఓ సంఘం అధ్యక్షులు చల్లా కిశోర్ తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్, రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు రఘురామిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్‌కుమార్, నరేష్, కణేకల్లు మండల ఏపీటీఎఫ్ అధ్యక్షుడు అస్లాం బాషా, ప్రధాన కారదర్శి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్ సైనిక్ శిబిరానికి క్యాడెట్ల ఎంపిక



క్యాడెట్లను పరీక్షిస్తున్న ఎన్‌సీసీ ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్లు

కూడేరు: మండలంలోని బ్రాహ్మణపల్లి వద్దనున్న ఎన్‌సీసీ నగర్‌లో సీఏటీసీ-2 ఎన్‌సీసీ క్యాంప్‌లో ఢిల్లీలో సెప్టెంబర్‌లో జరగనున్న తల్ సైనిక్ -2024 శిబిరానికి క్యాడెట్ల ఎంపికకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల క్యాడెట్లకు శిక్షణ ఇస్తున్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్ ఎన్‌సీసీ ట్రెనింగ్ సెంటర్‌కు చెందిన ప్లానింగ్ అండ్ కోఆర్డినేషన్ అడిషనల్ డైరెక్టర్(ఏడీ) కల్నల్ సంజయ్ గుప్తా , ట్రెనింగ్ అడిషనల్ డైరెక్టర్ (ఏడీ) మేజర్ పారుల్ శర్మలు ఎన్‌సీసీ నగర్‌ను సందర్శించారు. పరీక్షలో ప్రతిభ కనబరిచిన క్యాడెట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కర్నూల్ గ్రూప్ కమాండర్ ఎస్.రమేష్, క్యాంప్ కమాండర్ కల్నల్ బీఎస్ ప్రసాద్, డిప్యూటీ కమాండర్ శశికుమార్, ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ అధికారులు, 550 మంది క్యాడెట్లు పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



కూడేరు: వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి లక్ష్మీనారాయణ



గర్భిణులకు భోజనం అందిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, వైద్యాధికారిణి పావని

కూడేరు: గర్భిణుల్లో బీపీ (రక్తపోటు) పెరిగితే ఫిట్స్ వచ్చే అవకాశం మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం (పీఎంఎంవీవై) కింద గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ లక్ష్మీనారాయణ గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలని సూచించారు. గర్భిణులు ఆరోగ్య సూత్రాలను పాటిస్తే మాతాశిశువులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు భోజన వసతి

ఉరవకొండ: మండలంలోని రాకెట్ల పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణులకు హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండీ షఫీ ఉచితంగా భోజన వసతి కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పావని చేతుల మీదుగా 150 మందికి భోజనం అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగరంగయ్య, ఎంఎల్‌హెచ్‌పీ నాగసురేఖ, భారతి, హిమబిందు, హెబ్సిబా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అరాచకాలను తిప్పికొడదాం

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎంపీ రంగయ్య



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ తదితరులు

కుందుర్పి: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి.. ఎవరూ అధైర్యపడొద్దు.. టీడీపీ అరాచకాలను కలసికట్టుగా తిప్పికొడదామని మాజీ ఎంపీ తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు అన్నారు. మంగళవారం సాయంత్రం మలయనూరు గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల అనంతరం టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపైన దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు చేసే అరాచకాలను మనమందరం కలసికట్టుగా తిప్పి కొడదామన్నారు. ప్రభుత్వం ఆస్తులను టీడీపీ నాయకులు ధ్వంసం చేస్తుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఒక పక్క యానిమేటర్లను, ఫీల్డ్ అసిస్టెంట్లను, పారిశుధ్య కార్మికులను సైతం వదలకుండా నిబంధనలకు విరుద్ధంగా తొలగిస్తున్నారని కొందరు నాయకులు మాజీ ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. అలాంటి సమస్యలు ఎదుర్కొంటున్న వారు తమ దృష్టికి తీసుకొస్తే న్యాయపరంగా పోరాటం చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, ఎంపీపీ నాగరాజు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజగోపాల్ సర్పంచులు ఓబన్న, రామూర్తి, అతావుల్లా నాయకులు మందలపల్లి భీమప్ప, నరేష్, నాగలక్ష్మి, పెద్దరాజు, తెనగల్లు లింగప్ప, చాకలి మరిస్వామి, నిజవల్లిబాబు, నరసింహమూర్తి, పెద్దప్పయ్య, కుందుర్పి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

కూడేరు: మండలంలో 2023-24 ఏడాదిలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై ఈనెల 11 నుంచి క్షేత్ర స్థాయిలో సామాజిక తనిఖీ చేయనున్నట్లు సామాజిక తనిఖీ రాష్ట్ర రీసోర్స్ పర్సన్ లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు. మొత్తం రూ.7.56 కోట్లతో ఉపాధి పనులు చేపట్టగా, అందులో కూలీలకు వేతన రూపంలో చెల్లించింది సుమారు రూ.4.25 కోట్లు, మెటీరియల్ ఖర్చులకు రూ.3.4 కోట్లు ఖర్చు చేసినట్లు ఉపాధి పథకం మండల అధికారులు రికార్డుల్లో పొందుపరిచారన్నారు. ప్రభుత్వం అందించే సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీపైనా సామాజిక తనిఖీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం మండల ఉపాధి, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహిస్తామని, గురువారం క్షేత్ర స్థాయిలో తనిఖీలకు వెళ్తామన్నారు. తనిఖీల్లో 11 మంది సీఆర్పీలు పాల్గొంటారన్నారు. సమావేశంలో డీఆర్పీ లోకేష్ పాల్గొన్నారు.

15న కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం, సీపీఐ నాయకులు

బొమ్మనహాళ్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఈనెల 15న రైతులతో ధర్నా ఉంటుందని సీపీఐ కార్యదర్శి సంజీవప్ప, తాలుకా కార్యదర్శి నాగార్జున తెలిపారు. మంగళవారం మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయం వద్ద రైతులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నేమకల్లు, హిర్దేహాళ్ గ్రామాల పరిధిలో ఉన్న స్పాంజ్ ఐరన్ కర్మాగారాల నుంచి వెలువడే కాలుష్యాన్ని అరికట్టేందుకు రెవెన్యూ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. కర్మాగార కాలుష్యం వల్ల సమీపంలోని పంటలు దెబ్బతిని రైతులు ఏటా నష్టపోతున్నారన్నారు. యాజమాన్యం స్పందించి రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రైతు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం తాలుకా కార్యదర్శి తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు నరసింహులు, మండల కార్యదర్శి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న విత్తన పంపిణీ

కూడేరు: ప్రభుత్వం సబ్సిడీతో అందించే విత్తన పంపిణీ బుధవారంతో ముగియనుందని ఏఓ విజయ్ కుమార్ మంగళవారం తెలిపారు. మండలానికి మొత్తం 3,240 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయించారన్నారు. 3,502 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అందులో 3,237 మందికి 3,175 క్వింటాళ్ల వేరుశనగను పంపిణీ చేశామన్నారు.

భావసార విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అనంతపురం కల్చరల్: నగరంలోని భావసార క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు సంఘం కార్యదర్శి ఆనందరావు మహేంద్రకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేస్తామన్నారు. ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తులను స్థానిక రామనగర్‌లోని పాండురంగ స్వామి ఆలయంలో అందజేయాలని సూచించారు. ఈనెల 18న ఆలయంలో సన్మానం చేసి, జ్ఞాపికలు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9440587120, 8520085234 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు



ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామికి ఆకు పూజ చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతి దేవికి ప్రత్యేక పూజలు జరిగాయి. మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.